క్లుప్తంగా

వృద్ధులకు వస్త్రాలు, పండ్లు పంపిణీ



కుటుంబ సభ్యుల మధ్య పుట్టిన రోజు వేడుక చేసుకుంటున్న సినీ దర్శకుడు కల్యాణ్‌కృష్ణ

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి, కరప మండలం నడకుదురులోని వృద్ధాశ్రమాలతో పాటు ఇందిరా కాలనీ తదితర ప్రాంతాల్లో కురసాల కల్యాణ్ కృష్ణ యూత్ సభ్యులు ఆదివారం వృద్ధులకు వస్త్రాలు (చీరలు), పండ్లు పంపిణీ చేశారు. సినీ దర్శకుడు కల్యాణ్ కృష్ణ పుట్టిన రోజును పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు కర్రి చక్రధర్, ధోని శ్రీనివాస్, మోకా కృష్ణంరాజు తదితరులు తెలిపారు. కల్యాణ్ కృష్ణ తన పుట్టిన రోజు వేడులకను తన అన్న, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, కుటుంబ సభ్యులు, అభిమానుల మధ్య జరుపుకొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది, విద్యార్థులు

కరప: భారతరత్న, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం దేశ పౌరులకు, ప్రభుత్వాలకు శిరోధార్యమని గ్రామ కార్యదర్శి పోలిశెట్టి సునీల్ పేర్కొన్నారు. మండలం వాకాడలోని మండల ప్రాథమిక పాఠశాలలో ఆదివారం రాజ్యాంగ అవతరణ దినోత్సవాన్ని నిర్వహించి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఐదో తరగతి విద్యార్థులు సబ్ జూనియర్లుగా, 6, 7, 8 తరగతి విద్యార్థులు జూనియర్లుగా, 9, 10 తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులను సీనియర్లుగా విభజించి, క్విజ్, చిత్రలేఖనం, రాజ్యాంగంపై పోటీలు నిర్వహించారు. క్విజ్ మాస్టర్‌గా వంశీ సందీప్ వ్యవహరించారు. విజేతలకు రాజ్యాంగ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బహుమతులు అందజేస్తామని హెచ్ఎం వడ్లమూరి శ్రీరామారావు తెలిపారు.

పేద విద్యార్థులకు చేయూత



రెడ్ కాన్వెంట్ ట్రస్ట్ ద్వారా సహాయం చేస్తున్న సభ్యులు

బాలాజీచెరువు: పూర్వ విద్యార్థులందరూ కలిసి ఏర్పాటు చేసుకున్న రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్ (1978) ద్వారా ఏడేళ్ల కాలంలో రూ.90 లక్షలకు పైగా సేవా కార్యక్రమాలు నిర్వహించామని ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. దేవాలయం వీధిలోని కార్యాలయంలో ఆదివారం ట్రస్ట్ ద్వారా పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.1.25 లక్షల ఉపకార వేతనాలు అందజేశారు. అలాగే వైద్య సహాయం నిమిత్తం పేద మహిళలకు రూ.40వేలు, జీవనోపాధి నిమిత్తం మరో మహిళలకు వెట్ గ్రైండర్ అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి కళ్యాణి, పద్మనాభం, రెడ్నం రమణామూర్తి, సురేష్, సీమకుర్తి పాపారావు పాల్గొన్నారు.

కాకినాడ అధికారుల ఫోన్ నంబర్లు

మున్సిపల్ అధికారులు

కమిషనర్	9100945696
అదనపు కమిషనర్	9849907096
డిప్యూటీ కమిషనర్	9949921555
ఏసీపీ	9989743049
ఎంహెచ్‌వో	9949432320
ఎస్ఈ	9959988639
మేనేజర్	7093519888
టీపీఆర్వో	9701385284
అకౌంట్ ఆఫీసర్	9849907084
సిటీ మిషన్ మేనేజర్	7901610084
పంచాయతీ అధికారుల ఫోన్ నెంబర్లు	
డివిజినల్ పంచాయతీ అధికారి	9849903188
ఫుడ్ ఇన్‌స్పెక్టర్	9494297564
ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ	9100121109
జిల్లా వ్యవసాయశాఖాధికారి	8331056483
దేవదాయశాఖ	9290145126
డివిజన్ ఇన్‌స్పెక్టర్	
గృహ నిర్మాణశాఖ డీఈ	7093930577
పశుసంవర్ధకశాఖ జేడీ	9989932835
డీసీసీబీ జీయం	8341208227
జిల్లా సహకారశాఖ అధికారి	9100109168
జీజీహెచ్‌లో ముఖ్యమైన ఫోన్ నంబర్లు	
సూపరింటెండెంట్	98499 03870, 0884 2302001
సీఎస్ ఆర్ఎంవో	98499 03871
డీసీఎస్ ఆర్ఎంవో	98499 03871
ఆర్ఎంవో	0884 2302003
డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్	0884 2302002
అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)	98499 03873, 0884 2302004
పోలీస్ అవుట్‌పోస్ట్	83329 57924
అత్యవసర విభాగం	0884 2302021
బ్లడ్ బ్యాంక్	0884 2302009
మెడికల్ రికార్డ్స్ సెక్షన్ (ఎంఆర్‌డీ)	0884 2302018

సంరక్షణే పరమ లక్ష్యం..

- మాన, ప్రాణ, ఆస్తుల భద్రతపై పోలీసు శాఖ ప్రణాళిక
- బాధ్యతలు, హక్కులు, చట్టాలపై విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు
- అర్థం చేసుకుంటున్న విద్యార్థులు
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



ట్రాఫిక్ నిబంధనలను విద్యార్థులకు వివరిస్తున్న ట్రాఫిక్ సీఐ రమేష్

కాకినాడ క్రైం: ఈ రోజు మన స్కూల్‌కి పోలీసులు వచ్చి ఏదో విషయం మీద అవగాహన కల్పిస్తారట.. ఆ.. ఎంత సేపులే మనం అక్కడ లేమనుకొని ఓ గంట కళ్లు మూసుకుంటే ఇట్టే గడిచిపోతుంది.. ఇది సగటు విద్యార్థి ఆలోచనా ధోరణి. మరికొందరు విద్యార్థులు ఈ సదస్సుల సమయాన్ని తరగతులకు వెళ్లక్కర్లేకుండా తప్పించుకునే మార్గమని భావిస్తుంటారు. వీరందరికీ భిన్నంగా, ఇంకొందరైతే సదస్సులో ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకుంటారు. వక్తల ప్రతి వాక్యాన్ని విలువైనదిగా పరిగణిస్తారు. అలా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్న ఎంతో మంది విద్యార్థులు సదస్సుల నుంచి సత్ఫలితాలు పొందుతున్నారు. కొత్త అంశాలపై జ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నారు. అటువంటి వారి చొరవతో ఎన్నో సమస్యలు వెలుగులోకి వస్తున్నాయి. ఇంకెన్నో సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. కాకినాడ నగరంలో ముఖ్యంగా విద్యాలయాల కేంద్రంగా నగర పోలీస్ విభాగం నిర్వహిస్తున్న వివిధ అంశాలపై అవగాహన సదస్సులు విద్యార్థులకు తమకు అంతకుముందు తెలియని ఎన్నో కొత్త విషయాలను తెలియజేస్తున్నాయి.

ఏం బోధిస్తారంటే..

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీసుల అవగాహన సదస్సుల్లో వివిధ అంశాలపై విద్యార్థులకు జ్ఞానాన్ని అందిస్తున్నారు. మైనర్లు, బాలికల కోసం గుడ్ టచ్–బ్యాడ్ టచ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, గంజాయి సహా మాదక ద్రవ్యాలు, మద్యం, ధూమపానికి దూరంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించడం, హెల్మెట్ ధారణ, అతి వేగం వల్ల కలిగే అనర్థాలు, సెల్‌ఫోన్ డ్రైవింగ్, సైబర్ నేరాల నియంత్రణ, సామాజిక మాధ్యమాల వేదికగా బాలికలు, యువతులపై పెరుగుతున్న దురాగతాలు, పోక్సో చట్టం, డయల్ 100, 112 వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

లెక్కల మాస్టారి బాగోతం వెలుగులోకి..

కాకినాడ జగన్నాథపురంలోని బాలయోగి మున్సిపల్ హైస్కూల్‌లో వన్ టౌన్ సీఐ నాగ దుర్గారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గుడ్ టచ్, బ్యాడ్ టచ్ కార్యక్రమాన్ని ఆ పాఠశాల విద్యార్థులు సమర్థవంతంగా వినియోగించుకున్నారు. బ్యాడ్ టచ్ కోసం మహిళా పోలీసులు అక్కడి విద్యార్థునులకు అవగాహన కల్పిస్తుండగా తమ లెక్కల మాస్టారి శ్రీనివాసరావు వ్యవహారం ఇటువంటిదేనని స్పష్టమైంది. తమ పట్ల మాస్టారు వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదని వారికి అర్థమై. అక్కడికక్కడే పోలీసులకు చెప్పారు. పోలీసులు లోతుగా విచారిస్తే శ్రీనివాసరావు వ్యవహారం బట్టబయలైంది. సదస్సు పుణ్యమా అని, ఓ కీచకుడి ఆగడాలకు అడ్డుకట్ట పడింది.

విద్యార్థుల భావోద్వేగం..

ట్రాఫిక్ నిబంధనలను విద్యార్థులకు వివరించే క్రమంలో కాకినాడ ట్రాఫిక్ విభాగం సీఐలు నూనె రమేష్, రామారావు ఆధ్వర్యంలో ప్రతి రోజు అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. విద్యార్థులకు ముఖ్యంగా రోడ్లపై నడిచే విధానాన్ని వివరించడం, సైకిల్, స్కూటర్లను నడిపే విధానాలను వివరిస్తున్నారు. గత వారంలో ట్రాఫిక్–1 సీఐ రమేష్ జేఎన్‌టీయూకే వెనుక ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పిస్తూ హెల్మెట్ ధారణపై వివరిస్తున్నారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల కలిగే అనర్థాలను వెల్లడిస్తూ చోటు చేసుకున్న పలువురి మరణాలను ప్రస్తావించారు. ఇలా చెబుతూండగా, హెల్మెట్ ధరించక తమ తండ్రులు ప్రాణాలు కోల్పోయారని ఇద్దరు విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు. సీఐని సమీపించి చమ్మగిల్లిన కళ్లతో ధన్యవాదాలు తెలిపారు. తమలా ఇంకెవరూ హెల్మెట్ ధరించక తండ్రులను కోల్పోయే స్థితి రాకూడదన్నారు. అందుకు తాము కట్టుబడి ఉంటూ విస్తృత ప్రచారం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ ఘటన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ని కదిలించింది. విద్యార్థుల్లో స్ఫూర్తిని రగిల్చిన రమేష్ ఆయన బృందాన్ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

సైబర్ నేరాలపై..

ఇటీవల కాలంలో సైబర్ నేరాలకు విద్యార్థులు పలువురు బాధితులు కావడం ఆవేదన కలిగించింది. సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడుపుతున్న విద్యార్థులే లక్ష్యంగా పోర్న్ సైట్‌ల లింకుల ద్వారా ఎరవేయడం, సరికొత్త ఆఫర్లంటూ మభ్య పెట్టడం, ప్రమాదకర యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ సజెషన్స్ పంపడం తదితర కార్యకలాపాల ద్వారా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. నేరుగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ జేఎన్‌టీయూకేలోని అలుమినీ ఆడిటోరియంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన పెంపొందించారు. డిజిటల్ అరెస్టు పేరుతో డబ్బు గుంజుతున్న నేరగాళ్లను ఉటంకిస్తూ అసలు డిజిటల్ అరెస్టు అనే ప్రక్రియే లేదని స్పష్టం చేశారు.

హెల్మెట్ ధరించకపోతే నో ఎంట్రీ

పోలీస్ శాఖ నిర్వహిస్తున్న అవగాహన సదస్సులు సానుకూల ప్రభావాన్ని చూపుతున్నాయి. ట్రాఫిక్ నిబంధనలపై సీఐ రమేష్ ఆయన బృందం నిర్వహించిన సదస్సు పీఆర్ డిగ్రీ కళాశాల అధికారులను కదిలించింది. స్ఫూర్తి పొంది, విద్యార్థులకు హెల్మెట్ ధారణ తప్పనిసరి చేసే ప్రక్రియలో భాగంగా ద్విచక్రవాహనాలపై వచ్చే ప్రతి విద్యార్థి హెల్మెట్ ధరించే కళాశాల ప్రాంగణంలోకి ప్రవేశించాలని సర్క్యులర్ జారీ చేశారు. అలాగే, ట్రాఫిక్ నిబంధనలపై పరీక్షలు నిర్వహించి యాజమాన్యం విద్యార్థుల భవిత, ఉన్నతి పట్ల కళాశాల యాజమాన్యం తన నిబద్ధతను చాటుకుంది.

250కి పైగా సదస్సులు



ఎస్పీ విక్రాంత్ పాటిల్ మార్గనిర్దేశంలో నగరంలో పది నెలల కాలంలో 250కి పైగా సదస్సులు నిర్వహించాం. ట్రాఫిక్, దిశ, లా అండ్ ఆర్డర్ విభాగాలు నిర్దేశిత ప్రణాళిక మేరకు ఈ సదస్సులు నిర్వహిస్తున్నాయి. అవగాహన సదస్సులు సత్ఫలితాలు ఇవ్వడం మరింత ప్రోత్సాహకరంగా ఉంది. వీటి వల్ల అనూహ్య రీతిలో బోధనా ప్రక్రియలు, విద్యార్థుల ఆలోచన ధోరణిలో సానుకూల మార్పులు వచ్చాయి. సదస్సుల ప్రయోజనాలను విద్యార్థులు మరింత అందిపుచ్చుకోవాలి. ఆ దిశగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలి.

– రఘువీర్ విష్ణు, డీఎస్పీ, కాకినాడ



బాలికలు, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దిశ సీఐ రామచంద్రరావు



జేఎన్‌టీయూకే ఆడిటోరియంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్



గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై హాస్టల్ విద్యార్థినులకు అవగాహన కల్పిస్తూ..

భగవద్గీత కంఠస్థ పోటీలు



పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

బోట్‌క్లబ్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక భానుగుడి సెంటర్‌లోని ఒక పాఠశాలలో ఆదివారం భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారని పోటీల ఇన్‌చార్జి బీవీడీ వర్మ తెలిపారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన 70 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. ఈ పోటీల న్యాయనిర్ణేతలుగా శ్రీకృష్ణ నివాస్, శ్రీదేవి, లక్ష్మణశాస్త్రి వ్యవహరించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ పరిషత్ ఆధ్వర్యంలో ఏటా ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రఖండ, జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికచేస్తామన్నారు. డిసెంబర్ 1న గాంధీనగర్ మున్సిపల్ స్కూల్‌లోను, డిసెంబర్ 8న జగన్నాథపురం సామా పబ్లిక్ స్కూల్‌లోను, డిసెంబర్ 15న శాంతినగర్ రామకృష్ణా పబ్లిక్ స్కూల్‌లోను జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం సభకు హిందువులందరూ మద్దతు పలకాలని కోరారు. పరిషత్ కార్యవర్గ సభ్యులు గరిమెళ్ల అన్నపూర్ణయ్యశర్మ మాట్లాడుతూ భగవద్గీత ద్వారా వ్యక్తిత్వ వికాసం పెంచుకోవచ్చునన్నారు. పిల్లలు, పెద్దలలో భగవద్గీత సంస్కారం నింపుతుందన్నారు.

ఐదు లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట కొత్తూరు తూము వద్ద ఐదు లీటర్ల సారాతో పోలవరపు వెంకటరమణను అరెస్టు చేసినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కాకినాడ నార్త్ స్టేషన్ సీఐ కె.రామమోహనరావు తెలిపారు. నార్త్ స్టేషన్ పరిధిలో ఆదివారం దాడులు నిర్వహించామని తెలియజేశారు. దాడుల్లో ఎస్సైలు వరహాలు, కుమార్, సిబ్బంది సూర్యకిరణ్, జ్యోతి పాల్గొన్నట్టు తెలిపారు.

వైభవంగా లక్ష బిల్వార్చన



శివాలయంలో అభిషేకపూజలు చేస్తున్న భక్తులు

కరప: స్థానిక శివాలయంలో ఆదివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. వేద పండితులు కప్పగంతు దుర్గాప్రసాద్, రామ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో 13 మంది రుత్విక్‌ల బృందం, అర్చకులు విలపర్తి శ్రీనివాస్ తదితరులు పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు ఇచ్చారు. కరప పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు గోన చిన్నయ్య, చిన్నారి వీరభద్రరావు, గొర్రెల శ్రీనివాస్, పాట్నీడి భీమేశ్వరరావు, నక్కా నాగేశ్వరరావు, చిన్నారి మురళీకృష్ణ, రెడ్డి వీరభద్రరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు సహస్ర కలశాభిషేకం



సహస్ర కలశాభిషేకానికి ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

బోట్‌క్లబ్: స్థానిక రామారావుపేట సౌమ్య ఎన్‌క్లేవ్‌లో ఉన్న మరకత పీఠంలో సోమవారం సహస్ర కలశాభిషేకం వైభవంగా జరుగుతుందని పీఠం వ్యవస్థాపకులు నందమూరి వినోద్ ఆదివారం విలేకర్లకు తెలిపారు. పీఠం ఏర్పాటు చేసి 12 వసంతాలు పూర్తయిన సందర్భంగా వేలు గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి సహస్ర కలశాభిషేకం, షట్కోణ యంత్ర పూజ వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు స్వామి వారి శోభాయాత్ర జరుగుతుందన్నారు. అనంతరం లక్షా బిల్వార్చన వైభవంగా జరుగుతుందన్నారు. అయ్యప్ప దీక్షాధారులు, భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

నిరంతర అభ్యాసంతో జ్ఞానం



ఎంఎస్ ఆఫీస్‌లో శిక్షణ పొందిన ఉద్యోగులతో ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

- జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ
- బోధనేతర సిబ్బందికి ముగిసిన శిక్షణ

బాలాజీచెరువు: నిరంతర అభ్యాసనతో జ్ఞానం పెరుగుతుందని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో నాన్ టీచింగ్ సిబ్బందికి రెండు రోజుల పాటు నిర్వహించే ఎంఎస్ ఆఫీస్ శిక్షణ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ మనలో నైపుణ్యాలు ఉంటే ఎక్కడ ఉన్నా రాణించవచ్చని, మనకు ఉన్న జ్ఞానం ఇతరులకు నేర్పినప్పుడు మరింత పెరుగుతుందన్నారు. ఏదైనా ఒక సంస్థకు డేటా ముఖ్యమని, కింద స్థాయి సిబ్బంది డేటా సక్రమంగా నిర్వహిస్తే ఆ సంస్థ విజయవంతంగా ముందజలో ఉంటుదన్నారు. ఎంఎస్ ఆఫీసు టూల్స్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నిక్స్ నేర్చుకుని పనిని సులభతరం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ డైరెక్టర్ సుబ్బారావు, సిన్‌టాక్స్ సెల్స్ హెడ్ ఎం.వెంకట్, ఐఐఐపీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ, సీఎస్ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.రఘురామ్, రిసోర్స్ పర్సన్ షాజహాన్, సంతోష్, భార్గవ్ పాల్గొన్నారు.

శిల్పారామంలో విద్యార్థుల సందడి



కాకినాడ బీచ్ రోడ్డులోని శిల్పారామంలో ఆటలతో సందడి చేస్తున్న విద్యార్థులు



కాకినాడ బీచ్‌లో రోడ్డులోని శిల్పారామంలో కళావేదికపై నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

కాకినాడ రూరల్: బీచ్‌లో రోడ్డులోని శిల్పారామం ఆదివారం విద్యార్థులతో సందడి చేసింది. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని ఇంద్రపాలెం, కాకినాడ నగరంలోని మధురానగర్, సామర్లకోట నుంచి ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు తరలివచ్చారు. ఆయా పాఠశాలల బోధన సిబ్బంది పర్యవేక్షణలో చిన్నారులు ఆట పాటలతో సందడి చేశారు. కార్తికమాసం మూడో ఆదివారం అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చినట్టు శిల్పారామం ఇన్‌చార్జి ఏఓ మోహన్‌తేజ తెలిపారు.

వైభవంగా అయ్యప్పకు అర్చనలు



పలు రకాల పూల అలంకరణలో అయ్యప్పస్వామి పదునెట్టాంబడి



లక్ష బిల్వార్చనలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

బోట్‌క్లబ్: స్థానిక రిజర్వ్‌లైన్ అయ్యప్పస్వామి ఆలయం ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గోపూజ, విఘ్నేశ్వరపూజ, ఏకాదశ కలశారాధన, కలశాభిషేకం, గణపతి హోమం, సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు. ఆకుల రవికృష్ణస్వామి లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి వారి గర్భాలయంతో పాటు, వినాయకుడు, కుమారస్వామి, మాళికాపురత్తమ్మ ఆలయాలనూ అందంగా ముస్తాబు చేశారు. స్వామి వారికి రవి గురుస్వామి ఆధ్వర్యంలో 15 టన్నుల పూవులతో అభిషేకం చేశారు. అయ్యప్పస్వామి 18 మెట్లను పూలతో అలంకరించారు. సుమారు వెయ్యి మంది అయ్యప్ప స్వాములు ఈ పూజలో పాల్గొన్నారు. అయ్యప్ప శరణుఘోషతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. ఈ కార్యక్రమంలో వేలుగురుస్వామి పాల్గొన్నారు.

కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరే రైళ్లు

ట్రైన్ నం.	స్టేషన్	గమ్య స్థానం	వెళ్లే సమయం	వచ్చే సమయం
17258	కాకినాడ పోర్టు	విజయవాడ (డైలీ మెము)	04.20	23.03
17267	కాకినాడ పోర్టు	విశాఖపట్నం (డైలీ మెము)	04.45	21.28
12755	కాకినాడ పోర్టు	భావనగర్ (భావనగర్)గురు	05.50	16.48
17206	కాకినాడ పోర్టు	సాయినగర్ (షిర్డీ) సోమ, బుధ, శని	06.10	18.55
17221	కాకినాడ పోర్టు	లోకమాన్య తిలక్ (ఎల్‌టీటీ) బుధ, శని	09.10	13.43
17655	కాకినాడ పోర్టు	పుదుచ్చేరి (సర్కార్) ఆది, బుధ, గురు	14.40	09.10
17644	కాకినాడ టౌన్	చెంగల్‌పట్టు (సర్కార్) సోమ, మంగళ, శుక్ర, శని	14.40	09.10
17250	కాకినాడ టౌన్	తిరుపతి డైలీ	15.15	11.45
17210	కాకినాడ టౌన్	బెంగళూరు (శేషాద్రి) డైలీ	17.25	06.45
12737	కాకినాడ పోర్టు	లింగంపల్లి (గౌతమి) డైలీ	19.20	06.58
07445	కాకినాడ టౌన్	లింగంపల్లి (స్పెషల్)సోమ బుధ, శుక్ర	20.10	07.10

కల్కి అవతారంలో సీతారామస్వామి



బోట్‌క్లబ్: రజిత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న సీతారామ స్వామి కల్కి అవతారంలో దర్శనమిచ్చారు. స్వామి వారికి అర్చకులు పంచామృతాభిషేకాలు చేసి, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వన సమారాధనలు



కరపలో ఆట పాటలతో నిమగ్నమైన మహిళలు, చిన్నారులు

కరప: కార్తిక మాసం చివరి ఆదివారం కావడంతో మండల పరిధిలోని గ్రామాల్లో కార్తిక వన సమారాధనలు నిర్వహించారు. గ్రామాల్లోని మామిడితోటలు చిన్నా పెద్దా, పిల్లా పాపలతో, కేరింతలతో, ఆట పాటలతో సందడిగా కనిపించాయి. వివిధ సామాజిక వర్గాలవారు తమ వర్గీలయులను సమీకరించుకుని మామిడితోటల్లో ఉసిరిచెట్టుకు పూజలు చేసి, అన్నదానాలు నిర్వహించారు. పిల్లలు, పెద్దలు చెట్ల కిందకు చేరి ఆట, పాటలతో ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకుని, యేటా ఇలాగే కలుసుకుని, కష్ట సుఖాల్లో పాలు పంచుకుందామని నిర్ణయించుకున్నారు. అంత్యాక్షరి, మ్యూజికల్ చైర్, రింగాట, తాడాట వంటి ఆట, పాటలతో ఉల్లాసంగా గడిపారు. కరప, నడకుదురు, కూరాడ, వేములవాడ, గొర్రిపూడి, అరట్లకట్ట, గొడ్డటిపాలెం, కొరుపల్లి, గురజానాపల్లి తదితర గ్రామాల్లో కార్తిక వన సమారాధనలు నిర్వహించారు. కరపలో మండల ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. పలుకూరి భగవాన్, మండ శ్రీనివాస్ దంపతులు ఉసిరి మొక్క వద్ద పూజలు చేశారు. మండా త్రిమూర్తులు, ఉప్పలపాటి ప్రసాద్ తదితరులు ఏర్పాట్లు చేశారు.